# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 24-04-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ పహల్గాంలో దాడికి పాల్పడిన ప్రతీ ఉగ్రవాదిని వారికి మద్దతు ఇచ్చేవారిని భారతదేశం గుర్తించి శిక్షిస్తుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు.
- ❖ పాకిస్తాన్ జాతీయులకు భారత ప్రభుత్వం వీసా సేవలను నిలిపివేసింది.
- ❖ పహల్గాం ఉగ్రదాడి ఘటనపై జరిగిన అఖిలపక్ష సమావేశం కొద్ది సేపటి క్రితం ముగిసింది.
- ❖ దేశ ఉక్కు ఉత్పత్తిని 2030 నాటికి 300 మిలియన్ టన్నులకు పెంచడమే లక్ష్యంగా పెట్టుకున్నామని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తెలిపారు.

========================

పహల్గాంలో దాడికి పాల్పడిన ప్రతీ ఉగ్రవాదిని వారికి మద్దతు ఇచ్చేవారిని భారతదేశం గుర్తించి శిక్షిస్తుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు. జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా బీహార్‌లోని మధుబని జిల్లాలో జరిగిన బహిరంగ సభలో ప్రధానమంత్రి ఈరోజు ప్రసంగిస్తూ... ఉగ్రవాదం దేశ స్ఫూర్తిని ఎప్పటికీ విచ్ఛిన్నం చేయలేదని అన్నారు. న్యాయం జరిగేలా చూసేందుకు అన్ని ప్రయత్నాలు జరుగుతున్నాయని, దేశం మొత్తం ఈ సంకల్పంలో దృఢంగా ఉందన్నారు. మానవత్వాన్ని విశ్వసించే ప్రతి ఒక్కరూ భారతదేశంతోనే ఉన్నారని నరేంద్రమోదీ మాట్లాడుతూ...

(వాయిస్ 37 సెకన్లు)

ప్రధానమంత్రి తన ప్రసంగాన్ని ప్రారంభించే ముందు, పహల్గామ్ ఉగ్రవాద దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి నివాళులు అర్పించడానికి ఒక క్షణం మౌనం పాటించారు. అంతకముందు ప్రధానమంత్రి బీహార్ కి సంబంధించి 13 వేల 480 కోట్ల రూపాయల విలువైన బహుళ అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు, శంఖుస్థాపనలు చేశారు. గోపాల్‌గంజ్‌లో ఎల్‌పిజి బాట్లింగ్ ప్లాంట్, విద్యుదీకరణ ప్రాజెక్టులు, గృహనిర్మాణ పథకాలను వర్చువల్ విధానంలో ప్రారంభించారు. 870 కోట్ల రూపాయల విలువైన రైల్వే ప్రాజెక్టులను నాలుగు రైళ్లను నరేంద్ర మోడీ సభా వేదిక

నుండి ప్రారంభించారు. జయనగర్, పాట్నా మధ్య నమో భారత్ రాపిడ్ రైలును అలాగే ముంబైలోని సహర్సా, లోక్‌మాన్య తిలక్ టెర్మినస్ మధ్య అమృత్ భారత్ ఎక్స్ ప్రెస్‌ను ఆయన జెండా ఊపి ప్రారంభించారు.

=========================

పాకిస్తాన్ జాతీయులకు భారత ప్రభుత్వం వీసా సేవలను నిలిపివేసింది. వైద్య పరమైన వాటితో సహా ఆ దేశ ప్రజలకు ఇచ్చిన అన్ని వీసాలను రద్దు చేసింది. ఈ మేరకు భారత విదేశాంగ శాఖ ఈరోజు ఒక ప్రకటన విడుదల చేసింది. పాకిస్తాన్ జాతీయులకు భారత్ జారీ చేసిన అన్ని వీసాలు 2025 ఏప్రిల్ 27 నుంచి రద్దు కానున్నాయని మెడికల్ వీసాలు ఏప్రిల్ 29వ తేదీ వరకు మాత్రమే చెల్లుబాటు అవుతాయని ఆ ప్రకటనలో పేర్కొంది. ఈ గడువు ముగిసేలోగా వారంతా భారత్‌ను విడిచి వెళ్లిపోవాలని ఆదేశాలు ఇచ్చింది. భారత పౌరులు పాకిస్తాన్ లో పర్యటించవద్దని విదేశాంగ శాఖ సూచించింది.

=========================

పహల్గాం ఉగ్రదాడి ఘటనపై జరిగిన అఖిలపక్ష సమావేశం కొద్ది సేపటి క్రితం ముగిసింది. న్యూ ఢిల్లీలోని పార్లమెంట్ భవనంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షత వహించిన ఈ సమావేశానికి కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, బిజెపి జాతీయ అధ్యక్షులు జేపీ నడ్డా, కేంద్ర మంత్రులు జైశంకర్, నిర్మలా సీతారామన్, కిరణ్ రిజుజు, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, లోకసభ ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీతో పాటూ ఇతర పార్టీల నాయకులు హాజరయ్యారు. ఉగ్రదాడి ఘటన, తదనంతరం తీసుకున్న చర్యల్ని ప్రభుత్వం అఖిల పక్షానికి వివరించింది. ఉగ్రదాడుల్ని ఎదుర్కోవడంలో ఆయా పార్టీల సలహాలను కూడా కోరింది.

=========================

పహల్గాం ఉగ్రదాడి ఘటన నేపథ్యంలో గత రెండు రోజులుగా భారత్ పాకిస్తాన్ దేశాల మధ్య చోటుచేసుకుంటున్న పరిణామాలపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా, విదేశాంగ శాఖ మంత్రి ఎస్. జైశంకర్ లు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముతో ఈరోజు సమావేశమయ్యారు. ఈ ఉగ్ర దాడి ఘటనకు సంబంధించి పలు అంశాలను రాష్ట్రపతికి కేంద్రమంత్రులు వివరించారు. కాగా ఉగ్రవాదుల దాడుల వెనుక పాకిస్తాన్ హస్తముందని తీవ్రంగా పరిగణించిన భారత ప్రభుత్వం పాకిస్తాన్ తో సింధు నదీ జలాల ఒప్పందాన్ని తక్షణమే నిలిపివేస్తున్నామని, పాకిస్తాన్ జాతీయులకు అన్ని వీసాలను రద్దు చేస్తున్నామని నిన్న ప్రకటించింది. ఇందుకు ప్రతిగా పాకిస్తాన్ సైతం భారత విమానాలకు గగనతలాన్ని మూసివేయడం వంటి చర్యలను తీసుకుంది.

విరామం

=========================

“పీఎం గతి శక్తి జాతీయ ప్రణాళిక” ద్వారా 2030 నాటికి తలసరి ఉక్కు వినియోగం 98 కిలోల నుండి 160 కిలోలకు పెరుగుతుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ముంబైలో జరుగుతున్న ఇండియా స్టీల్ 6వ అంతర్జాతీయ సదస్సు ప్రారంభోత్సవంలో ఆయన దృశ్యమాధ్యమ విధానంలో మాట్లాడుతూ... భారతదేశ ఉక్కు పరిశ్రమ తన భవిష్యత్ పై ప్రగాఢ విశ్వాసంతో ఉందన్నారు. 2030 నాటికి దేశ ఉక్కు ఉత్పత్తిని 300 మిలియన్ టన్నులకు పెంచడమే లక్ష్యంగా పెట్టుకున్నామని నరేంద్ర మోదీ పేర్కొంటూ....

(వాయిస్ 35 సెకన్లు)

=========================

పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో భద్రతా పరిస్థితిని సమీక్షించడానికి ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది రేపు జమ్ము కశ్మీర్ లో పర్యటించనున్నారు. కాశ్మీర్ లోయలోనూ అలాగే నియంత్రణ రేఖ వెంబడి భద్రతా బలగాలు తీసుకున్న ఉగ్రవాద వ్యతిరేక చర్యల గురించి వివరించడానికి స్థానిక సైనిక విభాగాల అగ్ర కమాండర్లు ఆయనతో సమావేశం కానున్నారు. 15 కోర్ కమాండర్లతో పాటూ ఇతర రాష్ట్రీయ రైఫిల్స్ ఫార్మేషన్ కమాండర్లు కూడా ఈ సమావేశానికి హాజరు కానున్నారు.

========================

జమ్మూ కాశ్మీర్‌లోని ఉధంపూర్ జిల్లాలో ఈరోజు జరిగిన సెర్చ్ ఆపరేషన్ తర్వాత భద్రతా దళాలు, ఉగ్రవాదుల మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో  ఒక భారత సైనికుడు మరణించాడు. డూడు-బసంత్‌గఢ్ ప్రాంతంలో ఉగ్రవాదులు ఉన్నారనే సమాచారం ఆధారంగా భద్రతా దళాలు కార్డన్ సెర్చ్ ఆపరేషన్ ప్రారంభించిన సమయంలో ఈ కాల్పులు జరిగాయి. ఈ ఆపరేషన్ ఇంకా కొనసాగుతోంది.

========================

ప్రపంచ రోగనిరోధక వారోత్సవంలో ఈరోజు న్యూఢిల్లీలో తట్టు వ్యాధి నిర్మూలన ప్రచార కార్యక్రమాన్ని కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖా మంత్రి జె పి నడ్డా ప్రారంభించారు. 2026 నాటికి ఈ వ్యాధిని నిర్మూలించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని అన్నారు. భారతదేశ లక్ష్యం వైపు ఇది ఒక ముఖ్యమైన అడుగు. ఈ కార్యక్రమాన్ని వర్చువల్ విధానంలో జె పి నడ్డా ప్రారంభిస్తూ... పిల్లలకు రెండు డోసుల మీజిల్స్, రుబెల్లా వ్యాక్సిన్‌లను అందించడం ద్వారా నూరు శాతం రోగనిరోధక శక్తిని సాధించడానికి ఈ కార్యక్రమం ఒక అవకాశాన్ని కల్పిస్తుందని జె పి నడ్డా మాట్లాడుతూ...

(వాయిస్ 28 సెకన్లు)

========================

సిక్కిం రాష్ట్ర ప్రభుత్వం పోలీసు నియామకాల్లో అగ్నివీర్ జవాన్లకు 20 శాతం రిజర్వేషన్లు ప్రకటించింది. ఈరోజు గ్యాంగ్‌టక్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రేమ్ సింగ్ తమంగ్ ఈ విషయాన్ని వెల్లడించారు. రాష్ట్ర పోలీసు దళంలో వివిధ విభాగాల్లో మాజీ సైనిక సిబ్బందిని నియమించుకునే సమయంలో తమ ప్రభుత్వం 10 సంవత్సరాల వయో సడలింపును కూడా కల్పిస్తుందని చెప్పారు. పదవీ విరమణ చేసిన సైనిక సిబ్బంది వ్యాపార కార్యకలాపాల్లో పాల్గొనాలనుకునే వారికి రాష్ట్ర ప్రభుత్వం దుకాణాలను కేటాయిస్తుందని ముఖ్యమంత్రి ప్రకటించారు.

========================
========================